క్లుప్తంగా

## వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా చల్లా కుమార్



వినుకొండ: నియోజకవర్గ వడ్డెర సంఘం అధ్యక్షుడిగా ఇందిరానగర్‌కు చెందిన చల్లా కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుమార్‌ను నూతన అధ్యక్షుడిగా నిర్ణయిస్తున్నామని, జూన్1వ తేదీ నుంచి నియామకం అమలులోకి వస్తుందని, వడ్డెర సంఘం మాజీ అధ్యక్షుడు గుంజి కాళింగరాజు, నాయకులు తెలిపారు. పున్నయ్య, తమ్మిశెట్టి చిన్న అంకారావు, ఈర్ల వెంకటస్వామి, నరసింహారావు, వేముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



నరసరావుపేట: టీడీపీ కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయ నిధి ద్వారా 57 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.09కోట్ల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పంపిణీ చేశారు. వైద్య సహాయం కోసం ప్రభుత్వం అందించిన చెక్కులను తమకు అందేలా కృషిచేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సు



నరసరావుపేటటౌన్: తల్లిదండ్రులు ప్రతిరోజు పిల్లలపై శ్రద్ధ చూపటానికి కొంత సమయం కేటాయించాలని రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.గాయత్రి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లింగంగుంట్ల ఎస్టీ కాలనీలో ఆదివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యా హక్కు చట్టం, బాలల హక్కులు, బాల కార్మిక నిషేధ చట్టం గురించి వివరించారు. తప్పిపోయిన బాలలు, వారి తల్లిదండ్రులకు అవసరమైన న్యాయ సహాయం కోసం మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలన్నారు. పాఠశాలల్లో బాలికలకు ఎమైనా ఇబ్బందులు ఉంటే తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## బియ్యం, దుస్తులు వితరణ



వినుకొండ: బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో పట్టణంలోని లాయర్స్‌స్ట్రీట్‌లో 35 మంది నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు వితరణ చేశారు. అనంతరం జీవీ మాధవరావు దంపతులను ఘనంగా సన్మానించారు. 100 నెలలుగా నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు సంఘం తరపున బియ్యం, నూతన వస్త్రాలను అందించడం అభినందనీయమని అన్నారు. బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

## చిన్నారులు తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మాచర్ల: అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీశైలం రోడ్‌లోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాచర్ల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్, సీనియర్ లాయర్స్ గంగుల శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వారు పిల్లలను ఎత్తుకొని వెళ్లటానికి వచ్చారని గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం కానీ ఏదైనా గవర్నమెంట్ ఆఫీస్ దగ్గరికి వెళ్లి తెలియజేయాలని కోరారు. అంతేకాకుండా వారు పిల్లలను తీసుకెళ్లి వారి దగ్గర నుంచి అవయవయాలు తీసి వాటిని అమ్ముకునే ప్రయత్నం చేస్తారని అంతే కాకుండా పిల్లలను వేరే వారికి అమ్మి వేస్తుంటారని వివరించారు.

# నైపుణ్యాభివృద్ధికి బాసట

- బాసట ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం
- తొమ్మిదేళ్లుగా ఉచిత సేవలందిస్తున్న సంస్థ
- వేసవిలో విజ్ఞాన సముపార్జన చేస్తున్న బాలబాలికలు



విద్యార్థులు తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్స్



మట్టితో కళాకృతులు తయారు చేస్తున్న విద్యార్థులు

యడ్లపాడు: నిత్యం పాఠ్య పుస్తకాలతో కుస్తీపడుతూ.. ఏడాదంతా కష్టపడిన విద్యార్థులు పరీక్ష అనంతరం వేసవి విరామాన్ని ఎంజాయి చేస్తున్నారు. సాధారణ రోజుల్లో పుస్తకాలు, తరగతి గదుల్లో గడిపే పిల్లలు.. ప్రస్తుతం వేసవి సెలవుల్లో ఆటపాటలు విజ్ఞాన, వినోదాలతో సేద తీరుతున్నారు. సెలవుల్లో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ వీడి తమ భవితకు దోహదపడే నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటున్నారు. మెదడుకు పదునుపెడుతూ, పలు రంగాల్లో నిష్ణాతుల నుంచి జ్ఞానసముపార్జన చేస్తున్నారు. ఇందుకు యడ్లపాడు 'బాసట' సంస్థ వారికి చక్కని వేదికగా నిలిచింది.

**తొమ్మిదేళ్లుగా ఉచిత శిక్షణ...**

ఉచిత వేసవి శిక్షణ కార్యక్రమాల్ని బాసట సంస్థ గత 9 ఏళ్లుగా యడ్లపాడులో నిర్వహిస్తోంది. విద్యానైపుణ్యాలు, క్రీడా, సాహిత్య, సాంస్కృతిక కళలను ప్రోత్సహించే లక్ష్యంతో వీటిని ఏటికేడు సరికొత్తగా నిర్వహిస్తుంది. స్థానిక నారాయణ స్కూల్లో గతనెల 28 నుంచి ఉత్సాహభరితంగా ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరంలో 300 మంది చేరారు. కార్పొరేట్ సౌకర్యాలతో అసక్తి గొలిపే కొత్త అంశాలతో నిత్యం బోలెడు విజ్ఞానాన్ని అందించడంతో పిల్లలు, వారి తల్లిదండ్రుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతుంది. నిర్వాహకులైన నూతలపాటి కాళిదాసు, కల్లూరి శ్రీను(వాసు), కేతా రామబ్రహ్మంతో పాటు సభ్యులందరిని అభినందిస్తున్నారు. ఈనెల 27తో ఈ శిబిరం ముగియనుంది.

**పలు అంశాలపై శిక్షణ**

శిబిరంలో ఉపాధ్యాయులు, రచయితలు, ట్యూటర్లు, రీసోర్స్ పర్సన్లు, వివిధ రంగాల్లోని ప్రముఖులు స్వచ్ఛందంగా పాల్గొని తమ విద్యా, కళానైపుణ్యాలు భావితరాలకు తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీష్, హ్యాండ్‌రైటింగ్, స్టోరీ టెల్లింగ్, పేపర్ క్రాఫ్ట్, సులభ గణితం, సైన్స్ ఎక్స్‌పర్‌మెంట్స్, బాలసాహిత్యం, దేశ నాయకుల చరిత్ర, నీతికథల బోధన, మట్టితో కళాకృతుల తయారీ, క్రీడా శిక్షణతో పాటు పోటీలు నిర్వహిస్తున్నారు.

### వెనకబడ్డ సబ్జెక్టులపై పట్టు సాధించాం...



పాఠశాలలో చెప్పని విషయాలు అనేకం ఇక్కడ తెలుసుకున్నాం. కచ్చితంగా వేసవి శిక్షణ శిబిరం మాకు చాలా ఉపయోగపడుతోంది. లెక్కలపై భయం పోయింది. అలాగే పీఎస్ ప్రయోగాలు చేయించడంతో సబ్జెక్టుపై మరింత ఆసక్తి పెరిగింది. భాషా సబ్జెక్టులపై కూడా పట్టు సాధించగలిగాం. అనేక రంగాల్లోనూ ప్రవేశం కల్పించారు. ఆయా రంగాల్లోని విషయాలను తెలుసుకున్నాం.

– పోపూరి సుహాసిని, బెల్లంకొండ సుదీప్తిసోని, పోపూరి వినూత్నసాయి, టెన్త్ విద్యార్థినులు

### కమ్యూనికేషన్, క్రియేటివిటీ స్కిల్స్ పెరిగాయి



వేసవి శిక్షణలో విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కలిగేలా చేశారు. ఇంకా పేపర్లు, మట్టితో కళాకృతులు, గ్రీటింగ్ కార్డుల తయారీ చక్కగా నేర్పించారు. నిన్నామొన్నటి వరకు వేర్వేరు పాఠశాలల్లో చదివిన వారందరినీ ఈ శిక్షణ కేంద్రం ఒకచోట కలిపింది. కొత్తవారితో పరిచయాలు, వారు చదివే, మాట్లాడే విధానం తెలుసుకున్నాం. కమ్యూనికేషన్, క్రియేటివిటీ స్కిల్స్ పెంచుకున్నాం.

– వి.క్రాంతికుమార్, సాతులూరి ఫరితోష్, జూటూరి భానుకార్తికేయ, టెన్త్ విద్యార్థులు

### ప్రతిభకు మెరుగులు దిద్దడమే లక్ష్యం



శిబిరానికి మంచిస్పందన రావడం సంతోషంగా ఉంది. సహకరించిన దాతలకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు. ఈనెల 27న జరిగే ముగింపు సభకు డీఈఓ ఎల్.చంద్రకళ, డీవైఈఓ ఎస్ఎం సుభాని, ఎస్ఐ టి.శివరామకృష్ణ, ఎంఈఓలు హాజరై శిక్షణలో ప్రతిభ చాటిన విజేతలకు బహుమతులు, అలాగే బాసట 'ప్రతిభా ఛాలెంజ్–స్కాలర్‌షిప్ టెస్ట్ 2024–25'లో ఎంపికైన పది విద్యార్థులు ఐదుగురికి రూ.1.20 లక్షల స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేయనున్నారు.

– నూతలపాటి కాళిదాసు, బాసట అధ్యక్షుడు

## ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్





గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

రొంపిచర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ఉద్యమిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్ అన్నారు. స్థానిక బీసీ కాలనీలో గల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నిర్లక్ష్య వైఖరి కారణంగానే పాకిస్థాన్ ఉగ్రవాదులు దేశంలో చొరబడి 26 మందిని దారుణంగా హతమార్చారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారని మోదీ యుద్ధాన్ని ఆపడం దారుణమన్నారు. అదేవిధంగా మావోయిస్టులను చర్చలకు పిలిచి వారిని చంపడం హేయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడారు. తొలుత స్థానిక చెరువుకట్ట సెంటర్లో సీపీఐ జెండాను సీపీఐ, రైతు సంఘం సీనియర్ నాయకులు మాలెంపాటి నరసింహారావు ఆవిష్కరించారు. అక్కడ నుంచి మహాసభ జరిగే ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, ఏరియా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ప్రజానాట్యమండలి కళాకారులు షేక్ చిన్న జాన్ సైదా, సీపీఐ మండల నాయకులు రొద్దా అంజిరెడ్డి, పిడెం హుస్సేన్, జమ్ములమూడి వెంకటేశ్వర్లు, చిట్యాల శ్రీనివాసరెడ్డి, సరికొండ తిమ్మరాజు, గాలి వెంకటశివ, ముప్పూరి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీ పటిష్టతకు కృషిచేయాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



డాక్టర్ గోపిరెడ్డిని సన్మానించిన మాగులూరి, పదో వార్డు నాయకులు

నరసరావుపేట: నియోజకవర్గంలో ప్రతి ఒక్కరిని కలుపుకొనిపోయి పార్టీ పటిష్టతకు పాటుపడాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి శనివారం రాత్రి తన మద్దతుదార్లతో పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియచేశారు. దుశ్శాలువ కప్పి పూలమాల వేసి సన్మానించారు. ఈసందర్భంగా గోపిరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాగులూరి మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని, రాబోయే రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని, మళ్లీ ఎమ్మెల్యేగా డాక్టర్ గోపిరెడ్డిని, సీఎంగా జగన్‌ను గెలిపించుకుంటామని అన్నారు. మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ రెహమాన్, పార్టీ నాయకులు ఎన్‌కే ఆంజనేయులు, షేక్ కరీముల్లా, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, పదో వార్డు నాయకులు పాల్గొని రమణారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## భక్తి జ్ఞానాభివృద్ధి చెందాలి



ఉమామహేశ్వర వ్రతంలో పాల్గొన్న సమితి సభ్యులు

నాదెండ్ల: లింగధారి ధర్మం మానవతా ధర్మమని, మానవ సేవే భక్తి అని, ఆభక్తి జ్ఞానంగా అభివృద్ధి చెందాలని విజయవాడ రీజియన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విజిలెన్స్ సీఐ కె.రవిశంకర్ చెప్పారు. గణపవరం శివనాగేంద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం లింగధారి సర్వతోముఖాభివృద్ధి సమితి ద్వితీయ వార్షికోత్సవం, లింగధారుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా అతిథులతో ఉమామహేశ్వర వ్రతం, ఆదిజగద్గురువులు, బసవాది శరణుల జయంతి పూజా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధర్మాన్ని పాటించాలన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న వారు పేదలకు తమకున్న దాంట్లో కొంతమేరకు సహాయపడినపుడే అది మానవత్వంగా నిలుస్తుందన్నారు. కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలే కాకుండా సంఘసేవా కార్యక్రమాలు చేయాలన్నారు. అనంతరం అతిథులకు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో సమితి ఫౌండర్ మేనేజింగ్ ట్రస్టీ కొల్లిపర సిద్ధాంజనేయ, ఏపీ అధ్యక్షుడు పరదేశయ్య, తెలంగాణ అధ్యక్షుడు కోటగిరి విజయశంకరశాస్త్రి, గౌరవ అధ్యక్షుడు కొల్లిపర పూర్ణచంద్రరావు, బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఏపీ గౌరవ అధ్యక్షుడు శరభలింగం, ఫైనాన్స్ శాఖ సెక్రటరీ శ్రీనివాసరావు, ఐరా ట్యాక్స్ సొల్యూషన్స్ సీఈఓ మహేష్, తెలంగాణ జెన్కో ఏడీఈ నాగరాజకుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జె.అవినాష్, తిరుపతి మున్సిపల్ అధికారి యోగేశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చదువులమ్మ నీడలో.. జ్ఞాపకాల ఒడిలో..



పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు, టీచర్లు

- లూథరన్ పాఠశాలలో అ'పూర్వ' సమ్మేళనం
- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న 2000–21 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

యడ్లపాడు: కాలచక్రం ఎంత వేగంగా తిరిగినా, విద్యార్థి దశలోని స్నేహాలు, గురువుల బోధనలు మనసు మరచిపోదు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల ఆవరణలో 2000–2001 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా ఏర్పాటు చేశారు. 25 సంవత్సరాల విరామం తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకున్న అక్కడి వారి కళ్లు ఆనందభాష్పాలతో, హృదయాలు సంతోషాలతో విరబూసి, అనురాగ జల్లుల్లో తడిచి ముద్దయ్యాయి. 85 మంది పూర్వ విద్యార్థుల్లో 57 మంది ఈ వేడుకకు హాజరయ్యారు. నాటి గురువులు కనకవల్లి, వినతి, బాలసరస్వతి, మహితకుమారి, నిర్మల కుమారి, సునీత, శ్రీ షేక్ షావలి, రామిరెడ్డి, బ్రహ్మం, వాసు, పీటర్‌లను పూలదండలు, శాలువాలు, నూతన వస్త్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని బి.రాజేష్, అబ్బూరి శ్రీనివాసరావు, తులం అనిల్, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, పోపూరి శ్రీనివాసరావు, కేపీ చారి, చాగంటి మైథిలీ, వంగిపురపు పద్మావతి, ఆర్టీసీ డిపో మేనేజర్ అజిత, పూర్వ విద్యార్థులు ముందుండి, మిగిలిన బ్యాచ్ వారిని సమన్వయం చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు.

## మరీ రోడ్డుపై వదిలేస్తారా...

పిడుగురాళ్ల: అధిక లోడుతో వెళ్తున్నాయని పట్టుకున్నారు సరే.. మరి వాటిని రోడ్డుపైనే వదిలేస్తా ఎలా సారూ అంటున్నారు ప్రజలు. పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వెదురుగా గత నాలుగు, ఐదు రోజుల నుంచి టిప్పర్లు, లారీలు అధిక లోడుతో ఆగి ఉన్నాయి. అవి ఎవరివో తెలియక ప్రజలు అల్లాడిపోతున్నారు. నాలుగు రోజుల క్రితం అధిక లోడుతో వెళ్తున్నాయని పట్టుకున్నారు. పట్టుకున్న లారీలను పోలీస్ స్టేషన్ వెనుక ఖాళీగా ఉన్న స్థలంలో ఎప్పుడు పెడతారు, కానీ ఇప్పుడు విచిత్రంగా నడిరోడ్డుపై వదిలేశారు. అంతేకాకుండా లారీలు అడ్డంగా ఉండటంతో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఉండడంతో ఆదివారం అటుగా వెళ్లే భక్తులకు కూడా ఇబ్బందిగా మారిపోయింది. అంతేకాకుండా ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్దకు ఎవరైనా అతిథులు వచ్చినా ఈ వాహనాలు అడ్డంగానే ఉంటున్నాయి. లారీ వెనుక వైపు చిరువ్యాపారులు చేసుకునే వారికి కూడా వ్యాపారాలు సక్రమంగా ఉండటం లేదని, లారీల అడ్డం వలన మా చిరు వ్యాపారల వద్దకు ఎవరు రావటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అమరావతి, మాదినపాడు వంటి ప్రాంతాల నుంచి అధిక లోడుతో టిప్పర్లు పదుల సంఖ్యలో వస్తూనే ఉంటాయి. కానీ కేవలం నాలుగైదు పట్టుకోవటం, మిగిలిన ఎందుకు పట్టుకోలేదో అనే ప్రశ్నలు పట్టణ ప్రజలు మెదులుతూనే ఉన్నాయి. అంతేకాకుండా జానపాడు రోడ్డులో నిత్యం ట్రాక్టర్లను ఏర్పాటు దళారులు అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నారు. వారిపై కూడా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.





పట్టుబడిన ఇసుక లోడు లారీలు

## వైభవంగా పోలేరమ్మ తల్లి తిరునాళ్ల

పలుదేవర్లపాడు(ముప్పాళ్ళ): మండలంలోని పలుదేవర్లపాడు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి వార్షిక తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం విద్యుత్ ప్రభ నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## ఘనంగా ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం



మాచవరం: మండలంలోని కొత్తపాలెం శివారు ఆకురాజుపల్లి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవం భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిసర గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. క్యూ లైన్లలో బారులుతీరి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాచవరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తులకు స్వామి ప్రసాదాలు పంపిణీ చేశారు. మహిళలతో నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్తపాలెం గ్రామస్తులు ప్రభలను ఏర్పాటు చేశారు. స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నదానం చేశారు.

## హిమాలయ గురువు జన్మదిన వేడుకలు

వినుకొండ: శ్రీ హిమాలయ గురువు జన్మదినాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివయ్యస్థూపం సెంటర్‌లో భారీ అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ అధ్యక్షుడు పెండేల మోహన్‌రావు, ట్రెజరర్ కనిగండ్ల రామకోటేశ్వరరావు, వంగపల్లి బ్రహ్మం, పెండేల పుల్లారావు, మహిళా భక్తులు మల్లేశ్వరి, సుధా, మాతాజీ, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ మండల కార్యదర్శిగా రొద్దా అంజిరెడ్డి

రొంపిచర్ల: సీపీఐ మండల శాఖ నూతన కమిటీ కార్యదర్శిగా రొద్దా అంజిరెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక బీసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన ఆ పార్టీ మండల మహా సభలో మండల కమిటీ కార్యదర్శిగా అంజిరెడ్డిని ఎంపిక చేశారు. సహాయ కార్యదర్శిగా జమ్ములమూడి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అదేవిధంగా ఏడుగురు కమిటీ సభ్యులను, 17 మంది కౌన్సిల్ సభ్యులను ఎంపిక చేశారు. నూతన కమిటీని జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



నాదెండ్ల: మండలంలోని చందవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ ఆంజనేయస్వామి, బొడ్రాయి మూడో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారిని, స్వామివారిని అలంకరించారు. ఆంజనేయస్వామికి ఆకుపూజ, పంచామృతాభిషేకం, సింధూర పూజ నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజ, గోత్రనామ పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. ఆలయాలను సుందరంగా అలంకరించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు

ఎస్ఈ విజయ్‌కుమార్



మాచర్ల: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా సూపరింటెండెంట్ పి.విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని విజయపురిసౌత్‌లోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో విద్యుత్ అధికారులు, సిబ్బందితో డివిజన్ స్థాయి సమీక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. రెవెన్యూ వసూలు గురించి, చేపట్టిన పనుల గురించి చర్చించారు. విజయకుమార్ మాట్లాడుతూ వినియోగదారులతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. పనులు ఎటువంటి జాప్యం లేకుండా చేయాల్సిందిగా ఆదేశించారు. ఏప్రిల్, 2025లో రెవెన్యూ కలెక్షన్ పరంగా 100 శాతం లక్ష్యం చేరుకున్న సిబ్బందికి ప్రతిభ అవార్డులు అందజేశారు. సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు, మాచర్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సింగయ్య పాల్గొన్నారు.

## పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామానికి చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహాలకు పటిష్టమైన బందోబస్తు మధ్య ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొనటంతో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గ్రామంలో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరి అంత్యక్రియలలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.